క్లుప్తంగా

సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



గౌరమ్మ దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బ్రహ్మసముద్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌరమ్మ సేవలు అమోఘమని తహసీల్దార్ ఈశ్వరయ్య, రెవెన్యూ అధికారులు తెలిపారు. శుక్రవారం సీనియర్ అసిస్టెంట్ గౌరమ్మ ఉద్యోగ విరమణ చేశారు. ఆమెను రెవెన్యూ అధికారులు, సిబ్బంది సన్మానించారు. డీటీ కృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగిరెడ్డి, వీఆర్వోలు మల్రిస్వామి, వేణుస్వామి, నాగరాజు , మల్లికార్జున, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్యాలీ కోర్సులో నైపుణ్య శిక్షణ

కళ్యాణదుర్గం: నిరుద్యోగ యువతీ యువకులకు బెంగుళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సులో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి, ఇంటర్ పాస్/ఫెయిల్, డిప్లమో, డిగ్రీ విద్యార్థులు అర్హులన్నారు. 18 ఏళ్ల నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. బెంగుళూరులో శిక్షణ ఉంటుందని, 35 రోజుల పాటు భోజనంతో పాటు వసతి కల్పించబడుతుందన్నారు. 35 రోజుల కోర్సులో ట్యాలీ ప్లస్ జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లలో అత్యుత్తమ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం వివిధ ప్రైవేట్ సంస్థలలో 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మొదటి బ్యాచ్ ఈనెల 3న ప్రారంభమవుతుందని, పూర్తి వివరాలకు సెల్:9000487423లో సంప్రదించాలన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ



మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులకు బహుమతులు అందిస్తున్న మాస్టర్ ట్రైనర్

బెళుగుప్ప: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ సభ్యులు, హెల్పర్లకు స్థానిక కేజీబీవీలో మాస్టర్ ట్రైనర్లతో శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. అనంతరం మెనూ మేరకు వంటల పోటీలు నిర్వహించి, దుద్దేకుంట, హనిమరెడ్డిపల్లి, గుండ్లపల్లి గ్రామాల ఏజెన్సీ నిర్వాహకులకు మొదటి మూడు పోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ సరస్వతి, ఎంఆర్‌పీలు శంకర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆర్థిక సాయం



చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

బ్రహ్మసముద్రం : శెట్టూరు మండలంలోని ఐదుకల్లులో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు దయార్ద్ర హృదయులు ఆర్థిక సాయం అందించారు. భైరవానితిప్ప పంచాయతీ సర్పంచ్ శెట్టిగారి మంజునాథ రూ.10 వేలు, పోలేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిన్న నీలప్ప, మహాత్మరెడ్డి, డాక్టర్ వసంత్, కేటీఆర్ మంజు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఎంకే బాషా సేవలు అమోఘం



ఎంపీడీఓ ఎంకే బాషాను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

కూడేరు: మండల అభివృద్ధికి ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా చేసిన సేవలు అమోఘమని ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు అధికారులు కొనియాడారు. శుక్రవారం ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణ రెడ్డి అధ్యక్షతన వీడ్కోలు సభ నిర్వహించారు. ఎంపీపీ, ప్రజా ప్రతినిధులు, అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సుబ్బమ్మ, దేవ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏఓ నాగభూషణ రెడ్డి, ఏపీఓ తులసీ ప్రసాద్, ఎంఈఓ చంద్రశేఖర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసులు, ఏపీఎం రాజశేఖర్, హౌసింగ్ ఏఈ శేఖర్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వత్రా ఉత్కంఠ



- అందరిలోనూ టెన్షన్ టెన్షన్..
- మూడు రోజుల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఎన్నికల ఫలితాలపై ఎవరికి వారు అంచనాలు
- పార్టీల గెలుపుపై జోరుగా పందేలు


రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ. మరో నాలుగు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తల్లో టెన్షన్ నెలకొంది. అభ్యర్థులు ఇప్పటికే పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆయా పార్టీల అనుచరుల ద్వారా బూత్‌ల వారీగా కచ్చితమైన సమాచారం రాబట్టారు. ఓటర్లు ఏపార్టీ వైపు మొగ్గు చూపారు? ఏ గ్రామాల్లో ఎంత మెజార్టీ వస్తుంది? అనే లెక్కలూ ఇప్పటికే తేల్చారు. దీంతో ఓ వైపు గెలుస్తామన్న ధీమా.. మరోవైపు ఏం జరుగుతోందనన్న ఆందోళన. భారీ మెజార్టీతో గెలుస్తామని కొందరు.. తక్కువ మెజార్టీతోనైనా గట్టెక్కుతామనే ధీమా ఇంకొందరు.. ఇలా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పోలింగ్ ముగిసిన నాటి నుంచి ఇదే పరిస్థితి.

తొలి ఫలితం ఉరవకొండ

ఈనెల 4న జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అనంతపురం జేఎన్‌టీయూలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపు ఇక్కడే నిర్వహించనున్నారు. గత 2019 ఎన్నికల కౌంటింగ్‌లో పలు కారణాలు వెరసి ఉవరకొండ అర్ధరాత్రి వరకు లెక్కింపు పట్టింది. ఈ సారి అలా జగకుండా ఏకంగా 18 టెబుళ్లు ఏర్పాటు చేసి 15 రౌండ్లలోనే ఫలితం తేల్చేలా అక్కడి ఆర్వో (జిల్లా జాయింట్ కలెక్టర్) ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉవరకొండ తొలి ఫలితం ఆ తర్వాత కళ్యాణదుర్గం, చివర్లో రాయదుర్గం ఫలితం వెలవడనుంది.

ఒక్క ఓటు పైచేయి సాధించిన వారిదే విజయం..

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి ప్రత్యర్థి కంటే ఒక్క ఓటు పైచేయిసాధించినా విజయం వరిస్తుంది. ఆపై వచ్చే ఓట్లన్ని మెజార్టీ కింద లెక్కించ బడుతాయి. రాయదుర్గంలో 296 పోలింగ్ బూత్‌లు, 2,64,352 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో 2,27,248 మంది ఓటేశారు. కళ్యాణదుర్గంలో 261 పోలింగ్ బూత్‌లు, 2,30,785 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,13,207 ఓటింగ్‌లో పాల్గొనగా, 2,614 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. మొత్తం 2,15,821 మంది ఓటేశారు. ఉరవకొండలో 263 పోలింగ్ బూత్‌లు, 2,24,339 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,92,441 మంది ఓటింగ్ లో పాల్గొనగా, 2,554 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లేశారు. మొత్తం 1,94,995 మంది ఓటును సద్వినియోగం చేసుకున్నారు. ఆపై వచ్చే ఓట్లన్ని మెజార్టీకి కిందకు లెక్కిస్తారు. ఈ నేపథ్యంలో మూడు నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల భవిత్యం ఉత్కంఠను రేకేత్తిస్తున్నాయి.



మహిళలే విజయం వైపు నడిపిస్తారు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన 59 నెలల కాలంలో అందించిన సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాంది. ఇందులో మహిళలే ఎక్కువ శాతం భాగస్వాములైన విజయం వైపు నడిపిస్తారనే విశ్వాసం, నమ్మకం వైఎస్సార్‌సీపీ నేతల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో గత 2019 ఎన్నికల కంటే ఈ సారి 'ఫ్యాన్' గాలి మరింత స్పీడు పెరిగినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థులు మెట్టు గోవింద రెడ్డి, తలారి రంగయ్య, వై.విశ్వేశ్వరరెడ్డి విజయం తథ్యమని ఆ పార్టీ శ్రేణులంతా ఓ అంచనాకు వచ్చారు. కూటమితో జతకట్టి టీడీపీ ఆడిన డ్రామాలు ఈ ఎన్నికల్లో ఏమాత్రమూ పనిచేయలేదని, ప్రజలు వారిని విశ్వసించలేదన్న చర్చ సర్వాత్రా సాగుతోంది.

రికార్డు స్థాయిలో పందేలు..?

ఎన్నికల ఫలితాల తేదీ దగ్గరపడేకొద్దీ ఆయా నియోజకవర్గాల్లో రికార్డు స్థాయిలో పందేలు జోరందుకున్నాయి. వైఎస్ జగన్ రెండో సారి సీఎం అవుతారు..రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మెట్టు గోవింద రెడ్డి, తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా గెలుస్తారని పందేలు జోరుగా కాస్తున్నట్టు తెలిసింది. మెట్టు విజయంపై కర్ణాకట రాష్ట్రాల్లోని బళ్లారి, బెంగుళూరులోనూ ఊపందుకున్నట్లు సమాచారం. మరికొందరు టీడీపీ వైపు పందేలు కాస్తున్నట్లు చెపుతున్నారు.

నేడు ఎగ్జిట్‌పోల్ ఫలితాలు..

ఎన్నికల షెడ్యూల్‌లో ఆఖరి విడత పోలింగ్ జూన్ 1న ముగుస్తుంది. ఈ నేపథ్యంలో అదే రోజు సాయంత్రం ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెలువడనున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి రావొచ్చనే అంచనాలు తేలిపోనుంది. దీన్ని చూశాక బెట్టింగులు మరింత పెరిగే అవకాశం ఉంది.

నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ల వివరాలు..

నియోజక వర్గం	పోలింగ్ బూత్‌లు	మొత్తం ఓటర్లు	పోలైన ఓటర్లు	పోస్టల్ బ్యాలెట్లు
రాయదుర్గం	296	2,64,352	2,27,248	1,671
కళ్యాణదుర్గం	261	2,30,785	2,05,143	2,614
ఉరవకొండ	263	2,24,339	1,92,441	2,544

గజలక్ష్మి ఆలయంలో పూజలు



అలంకరణలో గజలక్ష్మిదేవి

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు చేశారు. ప్రతి శుక్రవారం అమ్మవారికిప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీవారి సేవలో విశ్వేశ్వరరెడ్డి దంపతులు



వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని వస్తున్న విశ్వ కుటుంబ సభ్యులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆయన సతీమణి భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో విశ్వేశ్వరరెడ్డితో పాటు సతీమణి, కుమారుడు యువనేత వై.ప్రణయ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు వెంకటేస్వామి సేవలో పాల్గొని, మొక్కులు చెల్లించున్నారు. ఆలయం వెలుపల మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

బెళుగుప్ప: మండల పరిధిలోని ఎవటాద్రిపల్లి సమీపంలో ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గుండ్లపల్లికి చెందిన చిరువ్యాపారి చాంద్‌బాషా, బెళుగుప్పకు చెందిన తిమ్మప్ప ద్విచక్రవాహనాల్లో వస్తూ వెంకటాద్రిపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. తిమ్మప్ప కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. చాంద్‌బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రి నుంచి, మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

విజయం మనదే

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి



తల్లిదండ్రులకు కేక్ తినిపిస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

రాయదుర్గం: ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాయదుర్గం నియోజకవర్గ ప్రజలందరి దీవెనలతో తప్పక మంచి మెజార్టీతో గెలుపొందుతామన్నారు. ఇందులో ఎలాంటి సందేహమూ అక్కర్లేదంటూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. గెలిచిన రోజు రాత్రికే వినాయక సర్కిల్‌లో బారీ కేక్ కట్‌చేద్దామని, ఇందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, మెట్టు యశోదమ్మ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెట్టు దంపతులు కేక్ కట్ చేయడంతో పాటు మిఠాయిలు పంచి, అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మెట్టు గోవిందరెడ్డి కుమారులు అమర్‌నాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, కోడళ్లు మెట్టు శాంభవి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కోకుర్తి ఉషారాణి, జయరామిరెడ్డి, నాయకులు పోరాళ్ల శివా, బొమ్మనహాళ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాజ్‌కుమార్, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

బెళుగుప్ప: మండల పరిధిలోని శీర్పి గ్రామ పంచాయతీ వీఆర్‌ఏ తలారి మహేష్ (35) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, రెవెన్యూ అధికారులు తెలిపిన మేరకు.. మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో అనంతపురంలో చికిత్సలు చేయించినా, ప్రయోజనం లేకపోయింది. బెంగళూరులో మెరుగైన చికిత్సలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.మృతుడికి భార్య తేజశ్విని, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు డీటీ హుస్సేన్ పీరా, ఆర్ఐ నగేష్‌బాబు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25,000 అందించారు. వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు ఎర్రిస్వామి, వీఆర్‌ఓలు టీ.ఎర్రిస్వామి, బి.ఎర్రిస్వామి, వీరాంజనేయులు, వీఆర్‌ఏలు ఓబుళప్ప, మహేంద్ర, సోము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి



మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ మల్లికార్జున

బొమ్మనహాళ్: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారాన్ని అందించాలని ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నదే గోరుముద్ద పథకం ఉద్దేశమన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని, తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. అనంతరం సిబ్బందికి వంటకాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రైనర్ హొసూరమ్మ, ఆర్‌పీజీ రామాంజనేయులు, సీఆర్‌పీలు అమరేష్, భాస్కర్, ఇస్మాయిల్, రామాంజనేయులు, మంజు, సుంకన్న పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు



మక్కా మసీదులో సమ్మర్‌క్యాంపు ముగింపు సదస్సు

రాయదుర్గంటౌన్: విద్యార్థి దశ నుంచే పిల్లల్లో చదువుతోపాటు ఆధ్యాత్మికత, నైతిక విలువలు నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ముఫ్తి తాహిర్‌సాబ్, ముఫ్తి నూర్ మహమ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక మక్కా మసీదులో ఇస్లామిక్ సమ్మర్ క్యాంపు (మర్తబ్) ముగింపు కార్యక్రమం జరిగింది. నెలరోజుల పాటు పట్టణంలోని మక్కా మసీదు, జామియా చౌక్ మసీదు, టిప్పు మసీదు, మదీనా మసీదుల్లో సెలవు దినాల్లో పిల్లలకు చదువుతోపాటు ఖురాన్, ప్రవక్త హదీసులు, ఇతరాత్ర ఇస్లామిక్ విద్య, నైతిక విలువల పెంపు పట్ల ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. మత గురువులు, హెల్పింగ్ హ్యాండ్స్ ఫ్రెండ్స్ గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. అనంతరం పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట



పట్టుబడిన మద్యం బాక్సులతో సెబ్ పోలీసులు

రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికల వేళ పొరుగు రాష్ట్రం మద్యం రవాణా, అనధికారిక విక్రయాలు, గంజాయి, నాటుసారా రవాణాకు సెబ్ పోలీసులు అడ్డుకట్ట వేశారు. సెబ్ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి, వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి నేటి వరకు జిల్లాలోనే అత్యధికంగా 134 కేసులు, 138 మంది ముద్దాలను అరెస్టు చేసి జైలుకు పంపారు. మొత్తంగా 2.75.97 లీటర్ల మద్యం, వాటికి ఉపయోగించిన 58 ద్విచక్ర, ఫోర్ వీలర్లను సీజ్ చేశారు. సెబ్ సీఐ మురళీమోహన్ మాట్లాడుతూ నియోజకవర్గం చుట్టూ కర్ణాటకకు ఆనుకొని ఉండడంతో జిల్లాలోకి అక్రమ మద్యం సరఫరా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. నిరంతర నిఘా ఉంచి, ఎక్కడికక్కడ కట్టడి చేశామన్నారు. రెండు నెలల కాలంలోనే 134 కేసులు పెట్టామన్నారు. మద్యం రవాణాకు వినియోగించిన వాహనాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గరపడడంతో మద్యం రవానాపై మరింత దృష్టి సారించినట్లు తెలిపారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



శ్రీధరఘట్టలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



కుందుర్పిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దామని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీధరఘట్ట, కొలగానహళ్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలను యువతకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, వెంకటరమణ, నాగరత్నమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

కుందుర్పి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ చాంద్ బేగం ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పొగాకు వ్యతిరేక దినోత్సవంపై ర్యాలీ చేశారు.



కూడేరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దూమపానంతో జీవితాలు బుగ్గి

కూడేరు: దూమపానంతో ఆరోగ్యమే కాదు.. జీవితాలు బుగ్గి అవుతాయని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కూడేరులో వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీడీ, సిగరేట్ తాగడం ద్వారా ఊపిరితిత్తులు దెబ్బతింటాయన్నారు. యువత దుమపానానికి బానిస అయితే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవీంద్ర, యశోద, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- డీఎస్పీ బి.శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ముద్దినాయనపల్లిలో కార్డెన్ సెర్చ్‌తో పాటు పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధులలో ర్యాలీ చేశారు. అనంతరం 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడా గుంపులుగా ఉండకూడదన్నారు. ఈనెల 4న గ్రామంలో ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలు చేయరాదన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వరాఇని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బహిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణమన్నారు. సమస్మాత్మక గ్రామాల్లో కౌంటింగ్ సందర్భంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐలు హరినాథ్, చంద్రశేఖర్‌తో పాటు పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


దుశ్చర్యలకు పాల్పడితే చర్యలు

ఉరవకొండ: ఈనెల 4న జరిగే కౌంటింగ్ సమయంలో దుశ్చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉరవకొండ అర్బన్ సర్కిల్ కార్యాలయంలో కౌంటింగ్ రోజు ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న చర్యలను వివరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు చేసినా, ఓటమి పాలైన నేతల అనుచరగణం రోడ్ల పైకి వచ్చి ధర్నాలు, అల్లర్లకు దిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 6 వరకు డీజేలతో సంబరాలు, బాణా సంచా కాల్చినా కేసులు నమోదు చేస్తామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు గుమిగూడి కనిపించినా చర్యలు ఉంటాయన్నారు. మండల వ్యాప్తంగా గ్రామాల్లో కార్డెన్‌సెర్చ్‌లు, ఫ్లాగ్‌మార్చ్‌లతో ప్రజలకు అవగాహన కలిగించామన్నారు.

గొడవలు సృష్టిస్తే ఉపేక్షించేదిలేదు..

కణేకల్లు: గొడవలు, అల్లర్లు సృష్టించేవారిపై చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు హెచ్చరించారు. శుక్రవారం ఉదయం మండలంలోని పెనకలపాడు, కోకుర్తి గ్రామాల్లో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. పలువురి ఇళ్ల, దొడ్లను పోలీసులు సోదాలు చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డి.హిరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సుధాకర్ రాజు సేవలు అమోఘం



ఎంపీడీఓ సుధాకర్ రాజును సన్మానిస్తున్న గుద్దెళ్ల నాగరాజు, గోవింద్

కంబదూరు: మండల ప్రజలకు ఎంపీడీఓ సుధాకర్ రాజు అందించిన సేవలు అమోఘమైనవని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, స్పెషల్ ఆఫీసర్ రాజన్న అన్నారు. ఎంపీడీఓ సుధాకర్ రాజు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొని ఎంపీడీఓ సుధాకర్ రాజును సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామి, సర్పంచులు హరినాథ్,లక్ష్మీదేవమ్మ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, ఎంపీటీసీ బసప్ప, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



రామాంజనేయులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వజ్రకరూరు: మండలకేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. రెండురోజుల క్రితం రామాంజనేయులుకు గుండెపోటు రాగా, కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. రామాంజనేయులు మృతదేహానికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సర్పంచులు మల్లెల జగదీష్, మోనాలిసా, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కిష్టప్ప, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, బీసీ సెల్ కార్యదర్శి నెట్టికల్లు, నాయకులు తేజేశ్వర్‌రెడ్డి, ప్రభుదాస్, భీమా, వెంకటేష్ నివాళులర్పించారు.

నేడు హనుమాన్ జయంతి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటలకు స్వామి దివ్య దర్శనం విశేష అలంకరణ, 9.30 గంటలకు హనుమద్ వత్రం, 10 గంటలకు సీతా రామచంద్ర స్వామి, ఆంజనేయస్వామి హోమం, 12.30 గంటలకు మహాపూర్ణావతి, మహామంగహారతి, మంత్ర పుష్పం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.

పశువుల పోస్టుమార్టంపై క్షేత్రస్థాయి శిక్షణ

బెళుగుప్ప: మండలంలోని ఆర్‌బీకేల పరిధిలో పశు సంవర్ధక సహాయకులకు పశువుల పోస్టుమార్టంపై మండల పశు వైద్యాధికారి రమేష్ శుక్రవారం క్షేత్ర స్థాయి శిక్షణ ఇచ్చారు. అంకంపల్లిలో రైతు భీమలింగకు చెందిన గొర్రె మృతిచెందింది. ఎర్రగుడిలో రైతు లక్ష్మీపతికి చెందిన జెర్సీ ఆవు మృతిచెందగా పోస్టుమార్టం నిర్వహించారు.